# సేతుబంధనం

ఎగ్జిబిషన్‌కు వెళ్లి వస్తుంటే కమల యెదురయింది. మొదట 'యిగ్నోర్' చేదామనుకున్నా గాని సాధ్యం అయిందికాదు. ముందు కమలే మాట్లాడింది:

''అటువేపు రావటంమానేశారు... కోపంగాని వొచ్చిందా?''

ఎందుకుకోపం? కోపంకాదా?

''నిన్నేం పెట్టిపోషిస్తున్నాను కనుకనా నీమీదకోపం?'' అన్నాను. తీరా అన్న తరవాత అనిపించింది యింత తేలికగా మాటాడేశానేమిటా అని.

కమల మాత్రం సామాన్యమయింది కనకనా? ''పెట్టి పోషిస్తేనే కోపం రావాలని రూలా?'' అవును. ప్రతివాడిమీదాకోపం.... ఎవరినీ పోషించను. నన్ను నేనే పోషించుకుంటున్నాను కనుకనా? అదోతృప్తి.

''అవున్లెండి కోపంవచ్చింది మీకు – ఎటో వెడుతున్నారు. రండి – ఎగ్జిబిషన్ చూదాం.''

''చూసే వొస్తున్నాను''

''నాకు చూపుదురు గాని''

''నువు చూళ్ళేవా యేమిటి? నామానాన నన్ను వొదిలెయ్యి, సాయంత్రం అటు వస్తాలే, మాటాడుకుందాం'' అన్నాను.

''సాయంత్రం తప్పకుండా వస్తారా?''

''ఏం చేస్తే నీకు నమ్మకం? అంత నమ్మిక లేకపోతే ఎట్లా? ఎవరిమీద ఒట్టు–''

''ఛాందసంగా మాట్లాడకండి. సాయంత్రం అయిదున్నరకి రండి – మర్చిపోకుండా వుంటే తప్పకుండా వస్తారు, నాకు మాత్రం తెలీదు కనకనా'' అంది.

కమల యీ మాత్రం ఎన్నూరెన్ను ఇస్తే చాలు, నేను సంతోషించగలను. ఎగ్జిబిషన్ కారణంగా ఊసుపోక సాయంత్రం కమల యింటికి వెళ్ళాలి నేను.

కమల...?

కాలం నామీద యెందుకింత పగపూనిందో అర్థంకాదు. క్షణం తీరికలేని ఉద్యోగం, ఆవులిస్తే పేగులు లెక్కెట్టే స్నేహితులూ, ఏపని చేయబోయినా అంతరాయం చెప్పే అంతరాత్మా...యేమిటి జీవితం?...తృణప్రాయంగా చూదాం అనుకుంటాను ప్రతీదాన్ని. ఆచరణలో యేదీ సాధ్యంకాదు. ఎవరికోసమో బతుకుతున్న నేను యెందుకో తెలీని పన్లు భుజాన వేసుకుని ఊళ్ళోని రోడ్లన్నీ నావేననుకొని కాళ్ళరిగేట్టు ఒళ్ళు కరిగేట్టు... మరేమిటో యేమిటో ఊహించటానికి అలివికాదు. అతీతమా? అర్థంకాదు.

ఏ క్షణం యెట్లాంటిదో తెలీదు. ఎవరెవరు వచ్చి పలకరిస్తారో తెలీదు, ఎవరి ఆహ్వానం పాటించి ఎన్ని శమదమాల పాలవాలో ఊహించలేము. యేమిటో అనిపిస్తుంది.

పేచీల్లేని వ్యవహారాలకోసం కలవరింతలు. బాధ్యతలేని సంసారాలకోసం తాపత్రయం. జీవితంతో సంఘర్షణ కావాలి. సత్యాలు తేలాలి. ఏదో రిసెర్చ్ చేయటానికి మనసు ఊరికే ఖేదపడటం. ఈ సమస్యలన్నీ యెప్పుడు పరిష్కారం అవుతాయో తలీదు. అసలు అవుతాయా?

జవాబు లేని ప్రశ్నలు. పదార్థాలు లేని చింతన.

కమల యెవరు?

జీవితాల్లో ఒకళ్ళకీ మరొకళ్ళకీ ఏమిటీ అనుబంధాలు? తెంచేసుకున్నా పోని నిబంధనలు యెందుకు? సృష్టికి రహస్యం అంటూ వుందా అసలు?

నా జీవితంలో కమల యెవరు?

ఏమీయెరగనివాడిని, పరచింత యెన్నడూ తలపెట్టనివాడిని, నా ఆలోచనలే నా సర్వస్వం అనుకునేవాడిని - నాకీ కమల జీవితంలో ఒక సమస్య ఎందుకవాలి?

అన్నీ కష్టాలు. ఒక దాని వెనక ఒకటి - పరంపరలా అనుసరిస్తో, సుఖమో కష్టమో నిష్ఠూరమో న్యాయమో ఒకటే సోకు మనసుకు.

డబ్బు సంపాదిస్తోకూడా ప్రతి పైసకీ బెదురు. రానున్న సంక్షోభానికి క్లేశం. ఊహించే విప్లవానికి దోహదం.

కమలని నే నొక్కసారి యెరగనట్టేఅనుకున్నాను. కాని...కాని జరిగిందేమిటి- చివరకు మిగిలిందేమిటి?

సాయంత్రం వెళ్ళాలా? ఇట్లా ఎన్నిసార్లు చెప్పలేదు...ఏమో, బుద్ధికి తోచదు యిట్లా చెయ్యాలని. కుంటి జవాబులు చెబుతాను గుర్తులేదని, యెవరో మరో పనిమీద పిల్చారని - కాని మనస్సులో అదే వేదన ఉంటుంది, కమల రమ్మంటే వెళ్ళలేదే అని! గాంభీర్యం తొణకదు. కన్ను మూసినా అదే ఆలోచన.

నా మనస్సుని యిన్ని సమస్యల్లో యెందుకు ముంచెత్తాలి కమల? కమల చేసిందిమటుకేమిటి? తెలిసి నేరం చేసిందా? తెలీకపోయినా నేరం నేరం కాక మానదు. ''ఇగ్నోరెన్స్ యీజ్ నో ఎక్స్‌క్యూజ్'' అంటారు గవర్నమెంటు వాళ్ళు.

నైతిక విలువల కోసం పాటుపడే నేను యెందుకిట్లా దిగజారి పోతున్నాను? యే శక్తి నన్నిట్లా కిందిమెట్లకు తోస్తూంది?

''కమల తప్పు చేస్తోందా?''

తప్పేమిటి? ఈ యుగంలో యెవరేం చేసినా తప్పనేందుకు ఎవరకీ అధికారం లేదు. కాని అంటున్న వాళ్ళకు జవాబేమిటి? కమల అంటే నాకిష్టం కాదా? ఎందుక్కాదు? మల్లెపువ్వులు తింటే చేదుగా ఉంటాయి.

సాయంత్రం వెడతాను! మేడమెట్లకింద చంటివాడిని చంకనేసుకొని కమల నించుంటుంది; ఊరికే నించోటం కాదు-వేయికళ్ళతో ఎదురు చూస్తోంటుంది నా కోసం. హు, చంటివాడు. వాడికప్పుడే రెండోయేడు. అయినా యింకా నాకా చింతన పోలేదు. కమలా! ఓ కమలా! హృదయాలు బద్దలుచేసుకొని భావాలు చదవ నేర్చిన కమలా!

నా ఉద్దేశం నీ కెందుకు అర్థంకాదు? ఎందుక్కాదు?

ఊహు. నీవందిచ్చే కాఫీగ్లాసుతోనూ, కాప్‌స్టన్ సిగరెట్లతోనూ నాకు మనశ్శాంతి కలుగదు. ఈ సత్యాలను నేను అన్వేషించాలి.

ఒక సంఘటన జరుగుతుంది. దానికి తుది మొదలూ ఉండవా? చారిత్రక విలువ వుండదా? కాలగర్భం కనికరించదా? జరిగిన ఉదంతాలు యింత తేలిగ్గా మీరిట్లా మర్చిపోతున్నారు? జవాబులు చెప్పండి. నా మనస్సింత వికలం అవుతుందేం?

(తెలుగు స్వతంత్ర 22-5-53)